క్లుప్తంగా

రేవంత్ వ్యాఖ్యలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: పోలీసులపై రేవంత్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడు మన్నె రవీందర్‌రెడ్డి బుధవారం అన్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో ఈనెల 14వ తేదీన జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోలీసులపై అనుచిత వాఖ్యలు చేశారని సిద్దిపేట వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రశంసాపత్రం అందజేత



వెంకటలింగం

సిద్దిపేటకమాన్: నేరస్తులకు శిక్షలు పడేలా విధులు నిర్వహించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాసాల వెంటకలింగం సేవలను గుర్తించి హైకోర్టు ప్రశంసా పత్రాన్ని అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ పీపీ వెంకటలింగంకు ప్రశంసా పత్రం అందజేశారు. పీపీని సీపీ, పోలీసు అధికారులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో టీజీటీ హిందీ సబ్జెక్టు గంటల ప్రాతిపదికన బోధించుటకు టీచరు (ఆంగ్లమాధ్యమ) పోస్టుకు ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ప్రిన్సిపాల్ వన్నీసా బేగం బుధవారం తెలిపారు. దరఖాస్తు చేయకున్నా 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆదర్శ పాఠశాలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన టీచరుకు నెలకు రూ.18,200 చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ ఎంపిక తాత్కాలిక మాత్రమేనని, పీరియడ్ ప్రకారంగా గౌరవ వేతనంగా చెల్లించడం జరుగుతుందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ఈనెల 18వ తేదీన సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఆరె కటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ అన్నారు. మహా ధర్నా కరపత్రాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె కటికలంతా ఐక్య పోరాటం చేస్తేనే తమ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వైన్స్ టెండర్లలో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

సర్దార్ పాపన్న జయంతిని జయప్రదం చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): బడుగు, బలహీన వర్గాల సాయుధ పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతిని విజయవంతం చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు పచ్చిమడ్ల స్వామిగౌడ్ పిలుపు నిచ్చారు. బుధవారం రసులాబాద్ ఎల్లమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 18వ తేదీన సర్వాయి పాపన్న జయంతిని ప్రతీ గ్రామంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులు, మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తిని నర్సింహులు, కొయ్యడ శ్రీనివాస్, ముత్యం విజయ్, నర్సింహులు, శ్రీను, బాలరాజు, విష్ణు, సంజీవులు, నరేష్ పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చు

నంగునూరు(సిద్దిపేట): దళిత బంధ పథకం పేరిట కేసీఆర్ దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. బుధవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ తొలి విడతలో నిరుపేదలను ఎంపిక చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పేర్లను జాబితా చేర్చారన్నారు.

కోళ్ల వ్యర్థాల దుర్వాసన

కొండపాక(గజ్వేల్): మండల పరిధి తిమ్మారెడ్డిపల్లి శివారులోగల శ్రీలక్ష్మీ శ్రీనివాస పౌల్ట్రీ ఫామ్ నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమారు ప్రజా ప్రతినిధులకు, పౌల్ట్రీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. బుధవారం సాయంత్రం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులతో కలిసి పౌల్ట్రీ ఫాంలోకి వెళ్ళగా కోళ్ల వ్యర్థాలను ఇష్టానుసారంగా వదిలి వేయడం గమనించారు. దుర్వాసనతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నామంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో 40 మంది చిన్నారులు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన భవనం కోసం ‘పంచాయితీ’

- ఎటూతేల్చని అధికారులు
- రోజురోజుకి ముదురుతున్న వివాదం
- కలెక్టర్ దృష్టిసారిస్తేనే పరిష్కారం



గ్రామసభలో ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా, మైసమ్మవాగుతండా గ్రామాల నూతన పంచాయితీ భవనాల స్థల ఎంపిక వివాదాస్పదంగా మారింది. మైసమ్మవాగుతండా గ్రామంలో ఇటీవల గ్రామ సర్పంచ్ సందబోయిన లావణ్య అధ్యక్షతన గ్రామసభను నిర్వహించగా పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, మబ్బుకుంటతండా, రంగన్నకుంట, బండమీదితండా, మైసమ్మవాగుతండా గ్రామస్తులు హాజరయ్యారు. రెండు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కావడంతో సత్వరం పనులు చేపట్టాలని కలెక్టర్ జీవన్ పాటిల్ ఇటీవల ఆదేశించారు. దీంతో నిర్మాణం పనులు చేపట్టేందుకు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సన్నాహాలు మొదలు పెట్టారు. కేశనాయక్‌తండా, మైసమ్మవాగుతండా గ్రామాల్లో దీనిని వ్యతిరేకిస్తూ ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. మైసమ్మవాగు తండాలో, రంగన్నకుంటలో ప్రభుత్వ స్థలం ఉందని ఈ రెండుచోట్ల ఎక్కడైనా నిర్మాణం చేసుకునేలా రెవెన్యూ అధికారులు స్థలాలను గుర్తించి అనుమతి పత్రాలను జారీ చేశారు. అదేవిధంగా కేశనాయక్‌తండా గ్రామంలో మాత్రం ఇంకా ప్రభుత్వ స్థలం ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించలేదు. ఇక్కడ కేశనాయక్‌తండాకు చెందిన రైతు లావుడ్యా రవి రైతు పంచాయతీ భవనం నిర్మాణానికి పది గుంటల సొంత స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించాడు.

తండాపేర్లపై మంజూరు

పైన పేర్కొన్న రెండు గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి స్థలఎంపిక విషయం అధికారులకు కత్తిమీద సాముగా మారింది. తమ తండా పేర్లమీదనే పంచాయతీ కార్యాలయం మంజూరైందని, మైసమ్మవాగుతండా, కేశనాయక్‌తండా గ్రామాలోనే నిర్మించాలని ఆ గ్రామాల ప్రజలు తీవ్ర స్థాయిలో తమపై ఒత్తిడి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కేశనాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం గుర్తించి నిర్మాణ పనులు చేసుకునేలా అనుమతి పత్రాలు ఇచ్చేందుకు సైతం రెవెన్యూ అధికారులు జంకుతున్నారని సందేహిస్తున్నారు. ఇక్కడ సర్పంచ్ రవీందర్ క్రీడా మైదానం సమీపంలో అందుబాటులోఉన్న ప్రభుత్వ స్థలంలో పంచాయతీ భవన నిర్మాణం చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కలెక్టర్ దృష్టిసారిస్తే తప్ప ఈ స్థల వివాద సమస్య పరిష్కారమయ్యేలా కనిపించడంలేదని గ్రామస్తులు

మెజార్టీ ఎటుఉంటే అక్కడే..



పంచాయతీ భవనాల నిర్మాణం విషయంలో ప్రజల మెజార్టీ ఎటుఉంటే అక్కడ నిర్మిస్తాం. త్వరగా పంచాయతీ భవనాల నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మైసమ్మవాగుతండా గ్రామంలో రెండు చోట్ల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చారు. కేశనాయక్‌తండా గ్రామంలో ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉందో గుర్తించినట్లు పత్రాలు ఇవ్వలేదు. – కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ అక్కన్నపేట మండలం

మేము రాజకీయాలు చేయం

ఎమ్మెల్యే సతీష్‌కుమార్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: సంక్షేమ పథకాలు అందించడంతో తాము రాజకీయాలు చేయమని, ఏపార్టీ అయినా ప్రజలందరు తమ వారేనని, అర్హులకు లబ్ధి చేకూరుస్తామని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయిలో చేతివృత్తుల లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్ష సాయం కోసం 7232 మంది దరఖాస్తు చేసుకోగా, 6022 మంది అర్హులను గుర్తించామన్నారు. తొలి విడతగా 295 మందికి రూ.2.95 కోట్లు అందించినట్లు తెలిపారు. తొలి విడతలో రానివారు ఆందోళన చెందొద్దని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందని అపోహ వద్దని అందరికీ మంజూరు చేస్తామని తెలిపారు. పక్షపాతం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, హన్మకొండ జెడ్పీ చైర్‌పర్సన్ సుధీర్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



దాసర్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండలంలోని అచ్చాయిపల్లి, దాసర్లపల్లి, శ్రీరాంపూర్ గ్రామాల్లో బుధవారం గడపగడపకు పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలను అదుపు చేయలేక పోతున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందజేస్తామని, నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు



నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని తోర్నాల గ్రామ కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా రెక్కల సురేందర్ రెడ్డిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సిద్దిపేట నియోజకవర్గంలో బలోపేతం చేయడానికి రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆరోపించారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిపై కిసాన్ సెల్ రైతుల పక్షాన నిలబడి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తోర్నాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గుర్రం అంజిరెడ్డి, బింగి యాదిగిరి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు దొంతి రెడ్డి మహిపాల్ రెడ్డి, సిద్దిపేట రూరల్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్ రెడ్డి, పుల్లూరు గ్రామ శాఖ అధ్యక్షుడు కనకయ్య గౌడ్, చిన్న గుండె వెళ్లి గ్రామ అధ్యక్షుడు పద్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పాయ్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ వర్ధంతిని కార్యక్రమాన్ని బుధవారం బీజేపీ సిద్దిపేట కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వాజ్‌పాయ్ నాయకత్వంలో దేశం చాలా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూమిని కాపాడండి



వినతి పత్రం ఇస్తున్న అఖిల పక్ష నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో ప్రభుత్వ మిగులు భూమిని కాపాడాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో సర్వే నంబర్ 12లో ప్రభుత్వానికి సంబంధించిన 1.20 ఎకరాల మిగులు భూమి ఆరు ఎకరాలు ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ భూమిని కొందరు నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మిగులు భూమిని దుర్వినియోగం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు కంచె వేయించాలని కోరారు. మిగులు భూమిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నాయకులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ, సీపీఎం, ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పునఃనిర్మాణానికి వినతి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లిలో హనుమాన్ దేవాలయ పునఃనిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని బుధవారం ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందించి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రికి, సహకరించిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల శ్రీనివాస్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు శివరాత్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: దళితులు అంబేద్కర్ సిద్ధాంతాలను పాటిస్తూ అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈనెల చివరివారంలో హైదరాబాద్‌లో జరిగే దండోరా మహాసంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల అంబేద్కర్ భవన్‌లో బుధవారం దండోరా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అన్నిరంగాల్లో రాణించాలంటే చదువొక్కటే మార్గమమని అంబేద్కర్ పేర్కొన్నారన్నారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా జరుగనున్న దండోరా మహాసంకల్ప సభను జయప్రదంచేయాలన్నారు.

కష్టజీవుల ఆకలికేక గద్దర్ పాట

హుస్నాబాద్: కష్టజీవుల కన్నీటిగాధలను పాటగా ఆలపించి శ్రమజీవుల పక్షాన పోరాడిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కన్నీటి నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దేశంలో పేదరిక నిర్మూలన కోసం గద్దర్ ఎంతో ఆకాంక్షించాడన్నారు. ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలని ఆరాటపడ్డారని తెలిపారు. హుస్నాబాద్‌కు గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉందని, శిథిలమైన అమరులవీరుల స్థూపాన్ని పునఃనిర్మించి అక్కడ గద్దర్ విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు.

డివిజన్‌లోనే కొనసాగించాలి

గజ్వేల్: దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనను స్వాగతిస్తున్నప్పటికీ రాయపోల్ మండలాన్ని గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కొనసాగించాలని బీఎంపీ(బహుజన్ ముక్తి పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌కు అతి సమీపంలో ఉన్న రాయపోల్ మండలాన్ని దుబ్బాకలో విలీనంచేసి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రభుత్వం కొత్త జిల్లాలు, డివిజన్, మండలాలతో పాటు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తేవడం హర్షనీయమన్నారు. అయితే రాయపోల్‌కు అతి సమీపంలో ఉన్న గజ్వేల్‌ను కాదని దుబ్బాకలో విలీనం చేయాలనే కుట్రలను తిప్పి కొడతామన్నారు.

ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నాడు

మద్దూరు(హుస్నాబాద్): ఏ పార్టీ నుంచి పోటీ చేసినా గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని, నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నారని మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద పని చేసిన అనుభవం తనకు ఉందన్నారు. సీఎం కేసీఆర్ టికెట్ ఇస్తే జనగమ నియోజకవర్గంలో గెలుపు సాధిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, ఆయన అనుచరులు అవినీతి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రచ్చ లక్ష్మయ్య, బండి చంద్రయ్య, బూర గంగాధర్, కోలా ఐలయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ తెలంగాణ, అసాయి షోటోకాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన సిద్దిపేటలో ద్వితీయ రాష్ట్ర స్థాయి ఓపెన్ టు ఆల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ పాషా బుధవారం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతు టోర్నీలో 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు, వందమంది బ్లాక్ బెల్ట్ మాస్టర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్, టోర్నీ ఆర్గనైజర్ మహమ్మద్ అహ్మద్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సోప్పరి ఎల్ల దాసు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు
డాక్టర్ పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత పథకాల పేరిట ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేరుగు గ్రామంలో పాడైన వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి ప్రారంభించాలని కోరుతూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

జనగామ టికెట్ ముత్తిరెడ్డికే

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ టికెట్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికే వస్తుందని, మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని తెలంగాణ విశ్వకర్మ మాతృసంఘ ప్రధాన కార్యదర్శి వర్కోజు శంకరాచారి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మొద్దన్నారు.

అర్హులకే దళితబంధు ఇవ్వాలి



కొడకండ్ల గ్రామంలో దళిత వ్యతిరేకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: అర్హులైన నిరుపేదలకే దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మండల పరిధిలోని కొడకండ్ల గ్రామ దళితులు పేర్కొన్నారు. బుధవారం గ్రామ చౌరస్తాలోని రాజీవ్ రహదారిపై దళిత వ్యతిరేకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు తమకు అనుకూలమైన వారిని దళితబంధుకు ఎంపిక చేస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు.

కొండపాక(గజ్వేల్): దళిత బంధు పథకం అందరికీ సమానంగా పంచాలని కోరుతూ బుధవారం మండల పరిధిలోని బందారంలో దళితులు వంటావార్పుతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామానికి ఏడు దళిత బంధు యూనిట్లు మంజూరయ్యాయంటూ ప్రభుత్వ ప్రకటన విడుదల కాగానే పైరవీలు మొదలయ్యాయన్నారు. లబ్ధిదారుల ఎంపికల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులను వివరాలు అడిగితే సరైన సమాధానాలు చెప్పకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

నంగునూరు(సిద్దిపేట): దళిత బంధ పథకం పేరిట కేసీఆర్ దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. బుధవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ తొలి విడతలో నిరుపేదలను ఎంపిక చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పేర్లను జాబితా చేర్చారన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పథకం పేరిట దళితులను మోసం చేస్తున్నారన్నారు.

దళితులను మోసం చేస్తున్న బీఆర్ఎస్

సిద్దిపేటరూరల్: దళితబంధు పేరుతో దళిత ఓట్ల కోసం పచ్చని పల్లెల్లో మరోసారి చిచ్చుపెట్టి దళితులను మోసం చేస్తున్నాడని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ ఆరోపించారు. జిల్లాలోని ప్రతీ దళిత కుటుంబానికి దళిత బంధు పథకాన్ని అమలుచేసి ఆదుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీ బస్తీబాట

హుస్నాబాద్: పట్టణంలోని 4వ వార్డు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి హాజరై బస్తీలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలేదన్నారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమని, ప్రతీ ఒక్కరి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ రెండో విడత గొర్రెల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సాయిలు అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల, కురుమలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్ప బాగులు, డాక్టర్ మౌనిక, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు లింగం, ఎల్లారెడ్డి, ఉప్పలయ్య, తదితరులున్నారు.

◆ భగీరథ నీరు కలుషితం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మెట్టుబండలు స్టేజీ వద్ద ఉన్న భగీరథ వాటర్ ట్యాంకు నుంచి రామంచ, చంద్లాపూర్‌కు తాగునీటిని సరఫరా చేస్తారు. తరచూ పైపులైన లీకేజీ అవతుండటంతో నీరు కలుషితమవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ సంస్కారంతో కూడిన విద్య అందించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పిల్లలకు చిన్నతనం నుంచే సంస్కారాలతో కూడిన విద్యనందించాలని సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించినన సమావేశంలో ఆయన మాట్లాడుతు విద్యార్థులు తమ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను గౌరవించాలన్నారు. దేశానికి వెన్నుదన్నుగా నిలబడాలన్నారు.

◆ ప్రభుత్వ పథకాలు అందరికీ అందించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని, ప్రజలందరికీ అందించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం టెండర్‌లు నిర్వహించడంపై ఉన్న ఆసక్తి ప్రజా సంక్షేమంపై లేదన్నారు.

◆ వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానం

దుబ్బాకటౌన్: మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన కరికె మనస్విని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఆమెకు జిల్లా జడ్జి డాక్టర్ రఘురాం అవార్డు అందజేశారు.

◆ బీజేపీ పల్లెబాట

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో బుధవారం బీజేపీ పల్లెబాట నిర్వహించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, బద్దిపడిగ జైపాల్‌రెడ్డి, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి నర్సపూర్ చౌరస్తా వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పటేల్‌పూర, అంబేద్కర్‌నగర్, సంజీవయ్యనగర్, షాజీత్‌పూర, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, వివినగర్ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.